పరిగెత్తుకెళ్లిన కౌసల్య.. పోలయ్య దగ్గరనించి పిల్లాణ్ని లాక్కుంది. అప్పుడు ఆమె అనంతం కేసి విసిరిన చూపు ముందు.. శత్రుదేశపు ఉరికంబం కూడా దిగదుడుపే! వేలాడిపోతున్న పిల్లాణ్ని చూసి ఏడుస్తూ అనంతం మీద విరుచుకుపడింది కౌసల్య. అతనికి యుద్ధంలో వచ్చిన మెడల్స్ ఏవీ.. దించిన మెడ ఎత్తేలా చెయ్యలేకపో యాయి. సర్వీస్‌లో ఉండగా అతనెప్పుడూ ఎదుర్కోని 'కోర్ట్ మార్షల్'.. ఆ క్షణం కోడలి దగ్గర తప్పలేదు. కని పించే తూటాలని తప్పించుకున్నాడు కానీ.. వినిపించే తూటాలని తప్పించుకోలేక పోయాడు.

అతను ఏదో చెప్పబోయాడు.

ఆమె రొప్పుతూ చివరగా..

''రానంటే రమ్మన్నావు. వద్దంటే తీసుకెళ్లావు. నీలా మట్టిలో దొర్లాల్సిన ఖర్మ నా కొడుక్కి పట్టలేదు. వాడికే దైనా జరిగిందో.. నీ మీద పోలీస్ కేసు పెడతా'' అంది.

ఎప్పుడో శీతకాలం కోరుకున్న ఎండ.. వేసవిలో వడ గాల్పుగా కొట్టినట్టుందా 'ఏకవచనం'!

ఆమె కోపం అతనికి తెలిసిందే కానీ, ఈ స్థాయిలో ఎప్పుడూ చూసి ఎరగడు. యుద్ధం లేనప్పుడు శత్రు సైన్యంతో రొట్టెలు పంచుకున్న మనసతనిది. ఈగలు తోలుకునే క్రమంలో కొమ్మ విసిరితే, పిల్లాణ్ని పొడవబో యిందని పొరబడి.. కబేళాకి పంపించేస్తే, కళ్లవెంట నీరు కార్చటం తప్ప ఏమీ చెయ్యలేని గంగిగోవులా బేలగా చూస్తూ ఉండిపోయాడు.

కౌసల్య పిల్లాణ్ని తీసుకుని హాస్పిటల్ లోపలికి పరిగె త్తింది. అనంతం కూడా వెంటరాబోతే రావొద్దని చెప్పింది. లోపలికి వెళ్తూ..

''ఫస్ట్ ఎయిడ్ చేయించి తీసుకెళ్లిపోదాం. నెక్స్ట్ ఫ్లయి ట్‌కి మా ఊరికి టికెట్ బుక్ చెయ్యండి'' అని భర్తకి విసురుగా చెప్పింది.

* * *

లోపల క్యాజువాలిటీ వార్డ్‌లో నర్స్ పిల్లాణ్ని పడుకో పెట్టి కాలికి డ్రెస్సింగ్ చేస్తున్నా.. బ్లీడింగ్ ఆగటం లేదు. డాక్టర్ సూర్యారావు పిల్లాడి కళ్లకింద పరీక్షగా చూసి, అనంతం ఫోన్ చెయ్యగానే తెప్పించి ఉంచిన రెండు ప్యాకెట్ల ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మాను ఐవీ ద్వారా ఇచ్చాడు. గడ్డకట్టే కారకాలను పెంచే విటమిన్ కె ఇంజక్షన్ ఇచ్చాడు. బ్లడ్ శాంపిల్ తీసి కోయాగ్యులేషన్ స్క్రీనింగ్ తోబాటు మరికొన్ని టెస్ట్‌లు చేయించాడు. కాసేపటికి రక్త స్రావం ఆగింది. పిల్లాడు నీరసంగా కళ్లు విప్పాడు. నర్స్ చేత పేరెంట్స్‌ని రమ్మని కబురు చేశాడు. కౌసల్యని, ఆమె భర్తని కూర్చోమని..

''అనంతం ఎక్కడ!?'' అన్నాడు డాక్టర్.

**పులి ప్రవచనాలు వినదు..**
**జింక విన్నా ఉపయోగం లేదు.**
**శాంతంతో క్రోధాన్ని, మంచితో చెడుని,**
**సత్యంతో అసత్యాన్ని జయించొచ్చని**
**తెలుసుకోవాల్సిన అవసరం ఆమెకి**
**ఇంతవరకూ కలగలేదు. తెలుసుకోలేదు.**
**తెలుసుకోడానికి ఇంకా సమయం**
**పడుతుందేమో. ఏం లాభం?**
**ఆలస్యంగా వచ్చిన జ్ఞానం..**
**అజ్ఞానంతో సమానం.**

''బైట ఉన్నారు డాక్టర్!'' అన్నాడు రాజేంద్ర.

''అదేం?'' అడిగాడు సూర్యారావు.

సమాధానం చెప్పకుండా..

''బాబుకి ఇప్పుడు ఎలా ఉంది డాక్టర్?'' ఆదుర్దాగా అడిగింది కౌసల్య.

''ఎందుకిలా జరిగింది డాక్టర్!?'' అడిగాడు రాజేంద్ర.

''ప్రస్తుతం బానే ఉన్నాడు. ఇంతకుముందు ఎప్పుడూ బాబుకి దెబ్బలు తగలటం కానీ, బ్లీడింగ్ అవటం జరగలేదా?'' అడిగాడు సూర్యారావు బ్లడ్ రిపోర్ట్స్ చూస్తూ.

''లేదు డాక్టర్.. ఇదే మొదటిసారి. యూఎస్‌లో చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. వద్దంటే మా మావగారే పొలం తీసుకెళ్లారు'' అంది కౌసల్య. ఆమెకి అనంతం మీద కోపం ఇంకా తగ్గలేదు.

''సరే! ఓ విషయం చెబుతాను కంగారు పడకండి. మీ అబ్బాయికి హీమోఫీలియా ఉన్నట్టుంది'' అంటూ ఉండగానే..

''అంటే ఏంటి డాక్టర్?'' అడిగింది కౌసల్య కంగారుగా.

''ఏకారణంచేతైనా రక్తస్రావం జరిగితే, కొద్ది నిమి షాల్లో దానంతటదే గడ్డకట్టి ఆగిపోతుంది. కానీ, హీమో ఫీలియా పేషంట్లలో ఎనిమిది, తొమ్మిది, పదకొండు రకం రక్తస్రావ కారకాల్లో ఏదో ఒకటి చాలా తక్కువగా ఉండటంతో రక్తం గడ్డకట్టదు. హిస్టరీ తెలిస్తే తప్ప సర్జరీకి ముందు ఈ విషయం బయటపడదు. ఈ పేషెంట్లు చాలా తక్కువ శాతం ఉండటంతో మేమూ సాధార ణంగా వాటి గురించి పరీక్ష చెయ్యము'' అనగానే..

కౌసల్య ఆందోళనగా చూసింది.

డాక్టర్ ఇంకా చెప్పసాగాడు.

''అనుకున్న ప్రకారం రేపు టాన్సిల్స్ ఆపరేషన్ మొద లుపెట్టినట్లయితే.. రక్తం గడ్డకట్టక చాలా ప్రమాదం జరి గేది. ఓ రకంగా ఈరోజు చంటాడి కాల్లో ముల్లు గుచ్చు కుని మంచే జరిగింది. కొంతకాలం సర్జరీ వాయిదా వేద్దాం. నాకు తెలిసిన హెమటాలజిస్ట్‌కి బ్లడ్ శాంపిల్ పంపుదాం. ఫర్దర్‌గా ఎగ్జామిన్ చేసి ఏయే ఫ్యాక్టర్లు లోప మున్నాయో తెలుసుకొని.. ట్రీట్‌మెంట్ ప్రొటోకాల్ చెబు తాడు. ఆ తర్వాత టాన్సిల్స్ ఆపరేషన్ ప్లాన్ చేద్దాం. లేదంటే అమెరికాలో స్పెషలిస్ట్‌కి చూపిస్తానన్నా మీ ఇష్టం!'' అన్నాడతను వెనక్కి వాలి.

''ఏం ఫరవాలేదా డాక్టర్?'' విచారంగా అడిగాడు రాజేంద్ర.

''మందులు రెగ్యులర్‌గా వాడుతూ, దెబ్బలేవీ తగల కుండా చూసుకోవాలి. అవసరమైనప్పుడు ఫ్యాక్టర్లు ఎక్కించుకుంటే చాలు. జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది'' అన్నాడు సూర్యారావు.

* * *

ఈలోగా బ్లడ్ బ్యాంకు నుంచి ఫోన్ వచ్చింది. పక్కనే ఉండటంతో అనంతం, పోలయ్య వెంటనే వెళ్లి చెరో యూనిట్ బ్లడ్ రీస్టోర్ చేసి వచ్చి కూర్చున్నారు. ఎప్పుడూ నిటారుగా కూర్చునే రిటైర్డ్ ఆర్మీ హవిల్దార్ అనంతం.. బల్లపైన ఒంగి కూర్చుని మోకాళ్లపై చేతులు పెట్టుకుని నేలని చూస్తున్నాడు.

బైటవాళ్లకి కనబడనీయకుండా అతని కన్నీళ్లని జోళ్లు పీల్చుకుంటున్నాయి.

'మట్టిలో దిగటం ఖర్మనా? మట్టి లేనిదే మెతుకు లేదు. మట్టి లేనిదే బతుకు లేదు. అదేంటో.. ఈ కాలం మనుషుల లక్ష్యం మాత్రం పిల్లల కాలికి మట్టంటకుండా తిరగటం' అనుకుంటుంటే.. మెలితిప్పిన మీసాల మాటున మెత్తని గుండె విలవిల్లాడుతున్నది. లోపల ఏం జరుగుతున్నదో తెలీదు. చిన్న ముల్లు గుచ్చుకుంటే ఇంత ప్రమాదం ఎందుకైందో తెలీదు. ప్రస్తుతం చంటాడు ఎలా ఉన్నాడో తెలీదు. ఇందులో తన తప్పేంతుందో కూడా తెలీదు. ఏదైనా జరగరానిది జరిగితే.. కోడలు ఏం చేస్తుందో మాత్రం తెలుసు. నీరసంగా ఉన్నా సరే.. బ్లడ్ బ్యాంకు వాళ్లు ఇచ్చిన ఫ్రూట్ జ్యూస్ ప్యాకెట్‌ను తాగాల నిపించలేదు. మనవడి కోసం దాచి ఉంచాడు.

కాసేపటికి డాక్టర్ రూమ్‌లోంచి బైటకొస్తూ.. బల్లమీద కూర్చున్న తండ్రిని వెళ్లి పలకరించమని కౌసల్యకి సైగ చేశాడు రాజేంద్ర.

'గడ్డకట్టే లక్షణం బైటకొచ్చే రక్తానికే కాదు.. బయటకొచ్చే కోపానికి కూడా అవసరమే! రక్తస్రావాన్ని ఆపేందుకు కోయాగ్యులేషన్ ఫ్యాక్టర్లను శరీరం ఎలా ఉంచుకుంటుందో.. క్రోధాన్ని ఆపేందుకు బంధాలను కూడా పేనుకుంటూనే ఉండాలి' అని భార్యకి చెప్పాలని ఉందతనికి.

పులి ప్రవచనాలు వినదు..

జింక విన్నా ఉపయోగం లేదు.

శాంతంతో క్రోధాన్ని, మంచితో చెడుని, సత్యంతో అసత్యాన్ని జయించొచ్చని తెలుసుకోవాల్సిన అవసరం ఆమెకి ఇంతవరకూ కలగలేదు. తెలుసుకోలేదు. అనంతా నికి అవన్నీ తెలిసినా ఉపయోగం లేదు. అపార్థాలతో గీసుకున్న 'గిరి' చెరిగి, అసహనంతో పేరుకున్న 'గిరి' కరిగి, తిరిగి మామూలుగా మారటానికి ఆమెకి బహుశా కొంచెం సమయం పడుతుందేమో. ఏం లాభం? ఆల స్యంగా వచ్చిన జ్ఞానం.. అజ్ఞానంతో సమానం.

ఆమె కొడుకుని ఎత్తుకుని ఇంటికి వెళ్లిపోయింది.

''నాన్నా.. నాన్నా!'' అంటూ ఎంత పిలిచినా అనంతం పలక్కపోవటంతో.. డాక్టర్‌ని పిలవటానికి లోపలికి పరిగెత్తాడు రాజేంద్ర. ■

## ఉమా మహేష్ ఆచాళ్ల



'శాంతంతో క్రోధాన్ని జయించొచ్చని శాంతంగా ఉండేవాళ్లకి తెలిస్తే సరిపోదు.. క్రోధంతో ఊగిపోయే వాళ్లకి కూడా తెలియాలి' అని చెప్పే కథ.. 'అక్రోధేన జయేత్ క్రోధం'. రచయిత ఉమా మహేష్ ఆచాళ్ల. వీరి స్వస్థలం కాకినాడ జిల్లా తుని. కేంద్ర పరోక్ష పన్నుల విభాగమైన కస్టమ్స్ డిపార్టుమెంటులో ఉన్నతోద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యో గరీత్యా ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటున్నారు. 2016 నుంచి కథలు రాస్తున్నారు. ఇప్ప టివరకూ దాదాపు 50 కథలు.. నమస్తే తెలంగాణ, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, స్వాతి, వార్త వంటి ప్రముఖ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వీటిలోని 21 కథలతో 'సంఘే శక్తి కలియుగే' శీర్షికతో కథా సంపుటిని వెలువరించగా, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ నుంచి స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. మరో పదహారు కథలతో 'వ్యక్తావ్యక్తం' పేరుతో రెండో సంపుటి రాబోతున్నది. నమస్తే తెలం గాణ - ముల్కనూర్ సాహితీపీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న కథల పోటీలలో వరుసగా నాలుగు సార్లు బహు మతులు అందుకున్నారు. తెల్సా - 2022 కథల పోటీలో ఈనాడు కథా విజయం - 2019, 2020లో బహు మతులు పొందారు. మూడు కథలు కన్నడలో అనువాదమై.. అక్కడా ప్రాచుర్యం పొందాయి.